జనం కోసం..
అక్షర సమరం

ఈటీ సంగతి

21 నవంబర్ 2026 | శనివారం | హైదరాబాద్ | 4 పేజీలు

మత్తు పదార్థాల సరఫరాదారుపై
పీడీ యాక్ట్



(హైదరాబాద్ క్రైం, ఇడీ సంగతి)

మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరాకు పాల్పడుతున్న వ్యక్తిపై అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్దగొని రంగయ్య (45)పై ఈ చట్టం కింద చర్యలు తీసుకున్నారు. క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ సరఫరాలో అతడి ప్రమేయం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో రంగయ్య నుంచి 25 కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాచారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ అతడిపై మరో కేసు నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆల్ప్రజోలం సరఫరాకు సంబంధించి కూడా కేసు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వరుసగా మత్తు పదార్థాల అక్రమ సరఫరా వ్యవహారాల్లో నిందితుడి ప్రమేయం వెలుగుచూడటంతో ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించే ఇలాంటి కార్యకలాపాలను అరికట్టేందుకు పీడీ యాక్ట్ అమలు చేసినట్లు తెలిసింది.



స్నేహగ్రూప్ సంస్థల్లో
ఐటీ సోదాలు

(సయ్యద్ మొబిన్, ఇడీ సంగతి)

ప్రముఖ పౌల్ట్రీ సంస్థ స్నేహ గ్రూప్ కార్యాలయాలు, డైరెక్టర్ నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 16 ప్రాంతాల్లో శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సంస్థకు చెందిన కార్యాలయాలతో పాటు డైరెక్టర్ నివాసంలోనూ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.సంస్థ వ్యాపార లావాదేవీలు, ఆదాయపు పన్ను రిటర్నులు, ఆర్థిక రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పన్ను చెల్లింపులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వచ్చిన అనుమానాల నేపథ్యంలో ఈ తనిఖీలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సోదాలకు గల పూర్తి కారణాలు, అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.1982లో రామ్‌రెడ్డి చికెన్ మార్కెట్‌గా ప్రారంభమైన వ్యాపారం 1994లో స్నేహ ఫామ్స్‌గా విస్తరించింది. ప్రస్తుతం పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువుల దాణా తయారీ, వంట నూనెలు, సోయా ఉత్పత్తులు తదితర రంగాల్లో స్నేహ గ్రూప్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థ విస్తరణ నేపథ్యంలో ఐటీ తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మహిళల భద్రతకు రూ.30 లక్షల విరాళం

(హైదరాబాద్ క్రైం, ఇడీ సంగతి)

మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కార్తికేయ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. హైదరాబాద్ నగర భద్రతా మండలి (హెచ్‌సీఎస్‌సీ) మహిళా విభాగానికి రూ.30 లక్షల విరాళాన్ని అందజేసింది. శనివారం ఈ మేరకు సంస్థ ప్రతినిధులు విరాళాన్ని అందించారు.హైదరాబాద్



పోలీసు కమిషనర్ డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్ నాయకత్వంలో నగర భద్రతా మండలి ప్రజలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో భద్రతా కార్యక్రమాలను చేపడుతోంది. మహిళల రక్షణతోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ విరాళం ఉపయోగపడనుంది. ప్రజా భద్రతలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో ఈ సహకారం కీలకంగా నిలవనుంది.

జనం కోసం..
అక్షర సమరం

ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 86 | 21 నవంబర్ 2026 | శనివారం | 4 పేజీలు



వడ్డీ కింగ్‌ను విడిపించుకోవడానికి

తండ్రీతనయుల ఉరుకులు పరుగులు

● ఎలాంటి కేసు లేకుండా వదిలేశారు? ● స్థానిక పోలీసుల రాచ మర్యాదలు

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

సీసీఎస్ పోలీసులు రెండు రోజుల క్రితం నగరానికి చెందిన ఓ బడా వడ్డీ వ్యాపారిని అదుపులోకి తీసుకుంది. ఆయన ఇంట్లో లెక్కలేనన్నిదస్తావేజులు లభ్యమయ్యాయి. సీసీఎస్ పోలీసులు పూర్తిస్థాయి విచారణకు సిద్ధమవుతున్నారు. జస్ట్ గంట వ్యవధిలోనే వడ్డీ వ్యాపారి సామాజిక వర్గంకు చెందిన బడా నేత ఎంట్రీ ఇచ్చాడు. అంతే కాదు ఏకంగా ఆయన ఇద్దరు తనయులు రంగంలోకి దిగారు సదరు వడ్డీ కింగ్ పిన్‌ను అప్పటికప్పడు వదిలించుకొని వెళ్లారు. అసలు నగరంలో ఉండే వడ్డీ వ్యాపారి కోసం బాన్సువాడలో ఉండే ప్రజాప్రతినిధి ఆయన ఇద్దరు తనయులు ఉరుకులు పరుగులు పెట్టిన వైనం పోలీసు అధికారులే ఈసడించుకునేలా చేసింది. ప్రజల్లో వచ్చి నీతి ప్రవచాలు చెప్పే ప్రజాప్రతినిధి వడ్డీలతో జోరో దందా చేసే వ్యక్తి కోసం తనయులతో కలిసి ఎందుకు పైరవీ చేశాడనేది అధికార పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వడ్డీ పేరుతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న వ్యాపారులపై పోలీసులు గత కొంత కాలంగా ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే మూడుదఫాలుగా ఇలాంటి దాడులు జరిగాయి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా కఠినంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. అందుకే వడ్డీ రాయుళ్లు తమ దందాలను గుట్టుగా సాగిస్తున్నారు. అయితే ఇంతకాలం చోట మోట వడ్డీ వ్యాపారులభరతం పట్టిన పోలీసులు గత కొద్ది రోజులుగా బడా వడ్డీ రాయుళ్ల కోసం ఆరా తీస్తున్నారు. కోట్లాది రూపాయల టర్నోవర్ ఉండే వారిని ఆరుగురిని గుర్తించారు కూడా ఇందులో భాగంగా నిజామాబాద్ నగరంలోని గంగాస్థాన్ ప్రాంతానికి చెందిన వడ్డీ వ్యాపారంలో కింగ్ పిన్‌ను సీసీయస్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. అసలే సదరు కింగ్ పిన్‌కు పోలీసు అధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయి. అందుకే స్థానిక పోలీసులకు కాకుండా ఈ ఆపరేషన్ సీసీఎస్‌కు అప్పగించారు. అయినప్పటికీ దాడి విషయం ముందే పసిగట్టిన కింగ్ పిన్ అప్పటికే కీలక పత్రాలను సేఫ్ ప్లేస్ తరలించారట ఆయన ఇంట్లో కొద్ది మేరకే డాకుమెంట్‌లు లభ్యం అయ్యాయి. సదురు కింగ్ పిన్‌ను సీసీఎస్ స్టేషన్‌కు తరలించి తమదైన స్టైల్‌లో విచారించడానికి సిద్ధమయ్యారు. అలా చేయడానికి ఆయనేమైనా సాధారణ వ్యక్తా ? బడా నేతలకు బినామీ అనే టాక్ ఎలాగో ఉంది కదా అన్నట్లుగానే బాన్సువాడలో అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి రంగంలోకి వచ్చాడు. ఎన్నికల్లో తన కోసం సర్వ శక్తులు ఒడ్డే సాధారణ కార్యకర్తలకు ఆపదొస్తే అందుబాటులో ఉండని సదురు నేత ఎక్కడో నిజామాబాద్ నగరంలో వడ్డీ వ్యాపారి సీసీఎస్‌లో ఉంటే మాత్రం క్షణాల్లో రంగంలోకి దిగాడు. ఏహే ఆయనే కాదు తన రాజకీయ వారసులిద్దరిని రంగంలోకి దించాడు.. వామ్మో బడా నేత తనయులిద్దరూ పోలీసు బాస్ వద్దకు పరుగులు తీశారు. ఆయన మాకు చాలా కావాల్సిన వాడు సార్ అంటూ ప్రాధేయ పడ్డారు. బడా నేత కూడా వదిలేయాలని అదే పనిగా ఒత్తిడి చెయ్యడంతో వడ్డీ కింగ్ పిన్‌ను వదిలేశారు. నిజానికి సదరు వడ్డీ డాన్ లిక్కర్ దందాలోనూ ఆరితేరారు. ఇటీవల నగర శివారులో రియల్ ఎస్టేట్ దందా గోల్‌మాల్ చెయ్యబోయ్యారు కానీ పోలీసుల జోక్యంతో వెనక్కి తగ్గారు. ఇంతకి వడ్డీ డాన్‌ను విడిపించడానికి బాన్సువాడలో ఉండే బడా నేత తన ఇద్దరు తనయులు ఎందుకు ఉలిక్కి పడ్డారనేది ఆసక్తిగా ఉంది.

ఇందిరమ్మ బీమాతో నిరుపేద కుటుంబాలకు భరోసా

(రుద్రూర్, ఇదీ సంగతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రుద్రూర్ మండల ప్రత్యేక అధికారి అరవింద్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అరవింద్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం (బీమా) అందుతుందని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పథకం వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ అరవింద్, ఏపీఓ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ నారోజి గంగారాం, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నందిపేట్ మండల కేంద్రంలో ఆక్రమణల కూల్చివేత





(నందిపేట్, ఇదీ సంగతి)

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలోనీ పడిగేల చెరువు బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రైనీ ఐపిఎస్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపుతో స్థానికంగా ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. అధికారులు చేపట్టిన ఈ చర్యలతో బఫర్ జోన్ ఆక్రమణలపై మరోసారి చర్చ మొదలైంది. చెరువు కింద బఫర్ జోన్ అక్రమంగా నిర్మించిన 12 నిర్మాణాల్లో 4 కోర్ట్ కేసులో ఉండగా 8 నిర్మాణాలు తొలగిస్తున్నట్లు ట్రైనీ ఐపిఎస్ అధికారి సురేష్ తెలిపారు.

జనం కోసం..
అక్షర సమరం

ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 5 - సంచిక: 86 | 21 నవంబర్ 2026 | శనివారం | 4 పేజీలు



బీఆర్ఎస్ అక్రమాలను..
ప్రజలు మరిచిపోరు

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అవినీతికి పాల్పడిన వారు ఆధారాలతో సహా దొరికిపోయారని పేర్కొన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు మంత్రులుగా ఉన్న సమయంలో నీటి పేరుతో దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం నీటిపాలైందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో విచ్చలవిడిగా భూదోపిడీ జరిగిందని, ఆ పార్టీ అవినీతి చిట్టా చాలా పెద్దదని వ్యాఖ్యానించారు.రాహుల్‌గాంధీని మహనీయుల బిడ్డగా అభివర్ణించిన మహేశ్‌కుమార్ గౌడ్.. ఆయనకు పదవుల కంటే దేశ సేవే ముఖ్యమని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా విషయంలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిబద్ధతతో రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

దాబాలో నిషేధిత..
పాపీ స్ట్రా పట్టివేత

- 3.808 కిలోల భుక్కీ స్వాధీనం..
- నిర్వాహకుడిపై కేసు



(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న రాజస్థానీ దాబాలో నిషేధిత మత్తు పదార్థం వెలుగుచూసింది. ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి 3 కిలోల 808 గ్రాముల పాపీ స్ట్రా (భుక్కీ)ని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ డి.అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.తాతాజీ పర్యవేక్షణలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పెర్కిట్ సమీపంలోని జైవీర్ తేజ రాజస్థానీ ధాబాలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ధాబాలో వ్యాపారం చేస్తున్న చతురారాం కుమారుడు లాలారాం వద్ద నిషేధిత పాపీ స్ట్రా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.గజేందర్, ఎస్సై వి.రవి, హెడ్ కానిస్టేబుల్ భూమన్నతో పాటు కానిస్టేబుళ్లు సంకీర్త్, ప్రకాశ్ సింగ్, విశ్వనాథ్, శ్యామ్ సుందర్, సాయి కుమార్, అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన
చేయూత పింఛన్ల పంపిణీ



(నిజామాబాద్, ఇదీ సంగతి)

నగరంలోని 8వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డివిజన్ కార్పొరేటర్ మటం పవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్లు ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర అర్హులైన వారికి ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని కార్పొరేటర్ మటం పవన్ తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ మటం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును నిశితంగా పరిశీలించాలి





(నిజామాబాద్, ఇదీ సంగతి)

ఆలిండియా సర్వీసెస్ అధికారులు తమ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిశితంగా పరిశీలన జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 14 మందితో కూడిన ఆలిండియా సర్వీసెస్ అధికారులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం శనివారం నిజామాబాద్ జిల్లాకు చేరుకున్నారు. ఈ నెల 21 నుండి 28 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుపనున్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో వారు కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అలోక్ సింగ్, లోకేష్ మనోహర్ పాటిల్, మనిష్ పరిహార్, ప్రవీణ్ కుమార్, సచిన్ గోయెల్, శివం, రోమేల్ బిజల్వాన్, అభిషేక్ పరిహార్, దీపక్ శర్మ, నిహాల్ చంద్, పూజా మీనా, శుభం శుభ్, వికాస్ యాదవ్, నిధి కరన్వాల్ లను జిల్లా పాలనాధికారి స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. వీరిని రెండు బృందాలుగా విభజిస్తూ, ఒక్కో బృందానికి ఒక్కో గ్రామాన్ని క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటాయించారు. ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్ కు ఒక బృందాన్ని, బోధన్ డివిజన్ లోని భూలక్ష్మిక్యాంపు నకు మరో బృందాన్ని కేటాయించారు. క్షేత్రస్థాయి సందర్శనకు బయలుదేరి వెళ్ళడానికి ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠితో భేటీ అయ్యారు. వారికి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. నిజామాబాద్ ప్రధానంగా వ్యవసాయాధారిత జిల్లా అయినందున సాగు రంగంపై ఆధారపడి 70 శాతం మంది జీవనాలు వెళ్లదీస్తున్నారని వివరించారు. జిల్లాలో భారీ నీటి పారుదల ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలో ఎంతో కీలకంగా నిలుస్తోందని, అవకాశం మేరకు ఈ ప్రాజెక్టును సందర్శించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించాలని, భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమాన్ని ప్రజల జీవన స్థితిగతులను గమనించాలని అన్నారు. అన్ని అంశాలను నిశితంగా పరిశీలన జరిపి ఆకళింపు చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్

జనం కోసం..
అక్షర సమరం

ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 5 - సంచిక: 86 | 21 నవంబర్ 2026 | శనివారం | 4 పేజీలు



ఐజీపీ కార్తికేయను మర్యాదపూర్వకంగా కలిసిన

ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వింగ్ వైస్ చైర్మన్ మారా ప్రభు

(నిజామాబాద్, ఇదీ సంగతి)

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వింగ్ వైస్ చైర్మన్ మారా ప్రభు, ఐపీఎస్ అధికారి ఐజీపీ కార్తికేయను లక్డీకాపూల్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీపీ కార్తికేయకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ భేటీ మర్యాదపూర్వక వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మారా ప్రభు ఐజీపీ కార్తికేయతో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరస్పర మర్యాదాభిమానాలను చాటుకున్నారు.



నితిన్ నబీన్

జిల్లా పర్యటన రద్దు

◆ వచ్చే నెలలో అమిత్ షా నిజామాబాద్ పర్యటనకు అవకాశం

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

ఈ నెల 23న నిజామాబాద్ జిల్లాలో పర్యటించాల్సిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన రద్దయినట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ వెల్లడించారు. రానున్న రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన షెడ్యూల్ బిజీగా ఉండటంతో పర్యటనను రద్దు చేసినట్లు రాష్ట్ర ఇన్‌చార్జి నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందిందని తెలిపారు. వచ్చే నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారని, ఆ పర్యటనను నిజామాబాద్ వైపు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడారు. జిల్లాలో తీవ్రంగా ఉన్న నీటి ఎద్దడిపై వచ్చే నెలలో జిల్లా కలెక్టర్‌తో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని అరవింద్ తెలిపారు. అప్పటివరకు సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ముందస్తు ప్రణాళికతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి కుటుంబం విషయంలోనూ రాజకీయాలు చేశారని ఆరోపించారు. ఆయన తల్లి ఎమ్మెల్సీ పదవిని కోరినప్పటికీ కేసీఆర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలనే ఉద్దేశంతో ఆమెకు పోటీ చేసే అవకాశం కల్పించారని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అదే నీ బిడ్డ కవితా తెలంగాణ కోసం ఏ ప్రాణ త్యాగం చేసిందని ఎంపి గా ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టావు అని నిలదీశారు. తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి రేవంత్‌రెడ్డి కాదని, ఆయన పోరాటమంతా చంద్రబాబు నాయుడు కోసమేనని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులపై గతంలో నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మరమ్మతులు చేపట్టకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వెనుక రాజకీయ నిధుల సమీకరణే ప్రధాన ఉద్దేశమని ఆరోపించిన ఆయన.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలపైనా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ప్రతి అంశంపై బీజేపీ ప్రశ్నిస్తుందని, తాము అడిగే ప్రశ్నలకు బాధ్యతగా సమాధానాలు చెప్పాల్సిందేనని అన్నారు. రానున్న రోజుల్లో బెంగాల్, ఢిల్లీ తరహా రాజకీయ సునామీ తెలంగాణలోనూ సృష్టిస్తామని, ఆ ప్రభావంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొట్టుకుపోతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ హాకీ సాంకేతిక అధికారుల ప్యానెల్‌లో నిజామాబాద్ వాసికి చోటు

◆ ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌కు సాంకేతిక అధికారిగా గరుకుల సుమన్ ఎంపిక..

◆ తెలంగాణ నుంచి తొలి వ్యక్తిగా గుర్తింపు

(నిజామాబాద్, ఇదీ సంగతి)



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మైదానంలో హాకీ క్రీడలో ఓనమాలు నేర్చుకున్న గరుకుల సుమన్ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు అరుదైన గుర్తింపు తీసుకొచ్చారు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సాంకేతిక అధికారుల ప్యానెల్‌లో చోటు సంపాదించి ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ పురుషుల విభాగం పోటీలకు సాంకేతిక అధికారిగా వ్యవహరించే స్థాయికి చేరుకున్నారు. తెలంగాణ నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.నిజామాబాద్‌లో జన్మించిన సుమన్‌కు చిన్ననాటి నుంచే హాకీపై ఆసక్తి ఉండేది. స్థానిక కలెక్టరేట్ మైదానంలో ఆటను ప్రారంభించి, క్రమంగా తన ప్రతిభను మెరుగుపరుచుకున్నారు. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీల వరకు ఎదిగి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. క్రీడల్లో సాధించిన ప్రతిభకు గుర్తింపుగా 2011లో క్రీడాకోటాలో హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయంలో ఉద్యోగం పొందారు. ప్రస్తుతం అదే కార్యాలయంలో అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.హాకీ ఇండియా, ఆసియా హాకీ సమాఖ్య, అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పలు శిక్షణ, సాంకేతిక అధికారుల కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. నిరంతర శిక్షణ, అనుభవంతో జిల్లా స్థాయి పోటీల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా ఎదిగారు. తాజాగా ఎఫ్ఐహెచ్ అంతర్జాతీయ సాంకేతిక అధికారుల ప్యానెల్‌లో నామినేషన్ పొందడం ఆయన కెరీర్‌లో కీలక మైలురాయిగా నిలిచింది.సాధారణ క్రీడా మైదానం నుంచి అంతర్జాతీయ హాకీ వేదిక వరకు సుమన్ సాగించిన ప్రస్థానం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం. భవిష్యత్తులోనూ తన అనుభవం, సాంకేతిక పరిజ్ఞానంతో హాకీ అభివృద్ధికి కృషి చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

గౌడ సంఘం అభ్యున్నతికి అండగా ఉంటాం



(రుద్రూర్, ఇదీ సంగతి)

గౌడ కులస్తుల సంక్షేమం, సంఘం అభ్యున్నతికి తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి భరోసా ఇచ్చారు. రుద్రూర్ మండల గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మీసాల గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంఘం భవన నిర్మాణం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. “గౌడ సంఘం అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున , వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానన్ని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ (గ్రాజూ) మాజీ చైర్మన్ పత్తి రాము, శ్రీధర్ గౌడ్, బాలరాజ్ గౌడ్, గౌడ సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.